www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 11 జులై 2023 | 5 | డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి-అమలాపురం

ప్రస్తుత జాబ్ మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న కోర్సులలో నిరుద్యోగ యువతకు ప్రావీణ్యం కల్పించే దిశగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ముందడుగు వేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ఏపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14న స్థానిక సిరియం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్లో జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆవిష్కరించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులకు సంబంధించి శిక్షణలు ఎక్కువగా నిర్వహించి ఆ దిశగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను పెంపొందించాలన్నారు. నిరుద్యోగ యువత ప్రగతి కోసం స్కిల్ హబ్‌లు ఇతోధికంగా సహాయపడాలని ఆయన ఆదేశించారు. ఈ నెల 14న నిర్వహించే ఈ జాబ్ మేళాలో 14 కంపెనీలు సుమారు 1000 ఖాళీలు భర్తీ చేయడానికి జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

సమస్యలపై అంగన్‌వాడీల పోరుబాట

ప్రజాశక్తి-అమలాపురం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు కలెక్టరేట్ వద్ద సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా ప్రారంభించారు. సోమవారం, మంగళవారం 36 గంటలు నిరవధిక దీక్ష చేపట్టినట్లు అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 3000 మంది పైగా అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ ఈ ధర్నాలో పాల్గొన్నారు. రెండు రోజులు వంట వార్పు కూడా దీక్షా శిబిరం వద్ద ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కృష్ణవేణి, సిఐటియు జిల్లా కార్యదర్శి దుర్గా ప్రసాద్, బలరామ్ మాట్లాడారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీలకు తెలంగాణలో కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చి తొమ్మిదేళ్లయినా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించలేదని, ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించడానికి నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ఈ కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగాయి, కానీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు నయా పైసా కూడా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో అనేక పోరాటాలు ఫలితంగా వర్కర్లకు 1500, ఆయాలకు 750రూ పెంచుతున్నావని ప్రకటన చేసి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. 2015 నుండి టిఎ బిల్లులో ఇవ్వడం లేదని 2022 ఏప్రిల్ 25న అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా అంగన్‌వాడీలు 1972 చట్ట ప్రకారం గ్రాడ్యుటీకి అర్హులని తెలియజేసిందన్నారు. కానీ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. లబ్ధిదారులను కుదించడానికి పోషణ ట్రాక్ యాప్‌లను తీసుకు వచ్చి ప్రైవేటీకరణ విధానాల్లో భాగంగా రకరకాల యాప్‌ల పేరుతో పనిభారం పెంచారు తప్ప వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కర్లు, హెల్పర్లకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. ఆర్‌టిసి యునైటెడ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులడు బి.శ్రీనివాస్‌రావు ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు భాస్కరరావు నరేంద్ర, ప్రాజెక్ట్ నాయకులు బేబీ గంగారత్నం, సుజాత, వెంకటలక్ష్మి, రాణి, ఆదిలక్ష్మి, దుర్గమ్మ, బి.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్స్

ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియుజిల్లా అధ్యక్షులు కృష్ణవేణి

అర్జీలకు పరిష్కార మార్గాలు చూపాలి

ప్రజాశక్తి-అమలాపురం

అర్జీలపై సత్వరమే స్పందించి తగు పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాల్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 244 అర్జీలను కలెక్టర్ శుక్లా డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబుతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి మెరుగ్గా, ప్రత్యామ్నాయంగా జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలను అమల్లోకి తెచ్చిందన్నారు. ప్రజా సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కార మార్గాలు సులభంగా లభిస్తున్నాయన్నారు. సామాజిక భద్రతా పింఛన్లు, రెవెన్యూ భూ సమస్యలు, వివిధ ప్రభుత్వ పథకాలు మంజూరు కోరుతూ దరఖాస్తుల అందాయన్నారు. ప్రతి జిల్లా స్థాయి అధికారి తమ లాగిన్‌కు వచ్చిన దరఖాస్తులను వెంటనే ఓపెన్ చేసి విచారణ చేపట్టి విచారణ స్థాయిలో అర్జీదారునితో దిగిన ఫోటోలను మరియు విచారణ నివేదికలను స్పందన యాప్‌లో అప్లోడ్ చేస్తూ పూర్తిస్థాయిలో పరి ష్కార మార్గాలు చూపాలని స్పష్టం చేశారు. గడువు దాటిన అర్జీలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా అధికారులు పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. డివిజన్, మండల స్థాయి నుంచి అందిన అర్జీలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత డివిజన్, మండల అధికారులతో సంప్రదించి అర్జీదారులకు అక్కడి కక్కడే పరిష్కార మార్గాలు చూపారు. జిల్లా స్థాయిలో అందిన సమస్యలపై అందుబాటులో ఉన్న జిల్లా అధికారులతో సంప్రదించి తగు పరిష్కార మార్గాలు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ పి.శివశంకర్ ప్రసాద్, డి ఎం అండ్ హెచ్ఒ ఎం.దుర్గారావు దొర, డిఎస్ఒ ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, జిల్లా ఉద్యాన అధికారి బివి రమణ పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎస్.సుధాసాగర్, వివిధ శాఖలకు చెందిన జిల్లా సాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీని స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఆక్రమణ తొలగింపులో ఉద్రిక్తత

ప్రజాశక్తి-మండపేట

స్థానిక సత్యశ్రీ రోడ్డులోని దుర్గమ్మ గుడి ఎదురుగా డ్రెయినేజీపై బడ్డీకొట్టు తొలగించేందుకు పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు తదితరులతో కలిసి అక్కడకు చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ కేవలం టిడిపి కార్యకర్త అని కక్షకట్టి బడ్డీ తొలగించాలని చూస్తున్నారన్నారు. ఆక్రమణల తొలగింపుపై చిత్తశుద్ధి ఉంటే ఆరోడ్డులో వున్న ఆక్రమణలన్నీ తొలగించాలని కేవలం ఒక్కరిపై కక్ష గట్టి తొలగించడం సరికాదన్నారు. చివరకు అధికారులు ఒక వారం గడువిచ్చి అక్కడనుంచి వెళ్లిపోవడంతో అంతా సద్దుమణిగింది.

టిడిపిలో పలువురి చేరిక

కొత్తపేట : రావులపాలెం మండలం వెదిరేశ్వరం జగ్గిరెడ్డి కాలనీకి చెందిన పలువురు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు ఆధ్వర్యాన పార్టీలో చేశారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వం అవసరమన్నారు. అందుకు టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. చంద్రబాబు నాయకత్వం, తనపై నమ్మకంతో పార్టీలో చేరడంతో వెదిరేశ్వరంలో పార్టీ మరింత బలోపేతం అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తుల పట్టాభి రామారావు, చిలువురి సతీష్ రాజు, సయ్యపురాజు రామకృష్ణంరాజు, సయ్యపరాజు నరసింహరాజు, గంట సుబ్బారావు, కొప్పిశెట్టి ప్రసాద్, సరిపెల్ల శ్రీనివాసరాజు, సాధనాల శ్రీనివాస్, చిట్టూరి శ్రీను, మాగాపు హరీష్, కుడిపూడి గోవిందు పాల్గొన్నారు.

సుపరిపాలనే కాంగ్రెస్ లక్ష్యం : కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు

ప్రజాశక్తి-రామచంద్రపురం

సుపరిపాలన. ప్రగతి కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని దాన్ని కొనసాగించేందుకు ప్రజలంతా సహకరించాలని కేంద్ర మాజీ రక్షణ శాఖ మంత్రి ఎంఎం.పల్లంరాజు అన్నారు. ద్రాక్షారామలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకర్ రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పల్లంరాజు మాట్లాడారు. బిజెపిని వచ్చే ఎన్నికల్లో సాగనంపాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటుపరం చేయడం, పొరుగు దేశాలతో సత్సంబంధాలు కొనసాగించలేక వేలాది సైన్యాన్ని బోర్డర్లలో ఉంచి అధిక వ్యయం చేయడం తప్ప ప్రగతి సాధించింది ఏమీ లేదన్నారు. పేదలకు ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, అందరికీ విద్య హక్కు చట్టం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందని, పావర్టి లైనుకు దిగువున ఇంకా 26 శాతం మంది ఉన్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బలపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం, నాయకులు మల్లిపూడి రాంబాబు, ఆకుల వెంకటరమణ, గాలింకి చిట్టిబాబు, రేవు అమ్మాజీ రావు పాల్గొన్నారు.

ఆర్ఒల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాపూజీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

విఆర్ఒల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా మద్దాల బాపూజీ ఏకగ్రవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం విజయవాడ గాంధీనగర్ ఫిలిం చాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవిన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రామచంద్రపురం పట్టణ విఆర్ఒ బాపూజీ ఎన్నిక కావడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, ,కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాపూజీ మాట్లాడుతూ సంఘం నిర్మాణానికి, సమస్యల పరిష్కారానికి కషి చేస్తానన్నారు.

కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

తమకు ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రాలు అందించి తమ బిడ్డల విద్యాభివృద్ధికి తోడ్పడాలని బేడ బుడగ జంగాల కులస్తులు కలెక్టరేట్ వద్ద సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కోనసీమ దళిత ఐక్యవేదిక ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పేర్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో తమ కులస్తులు 15 వందల కుటుంబాలు జీవిస్తున్నాయని 4 వేల పైగా జనాభా కలిగిన తమకు ఉమ్మడి రాష్ట్రంలో రాజ్యాంగ హక్కుల ప్రకారం ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రాలు అందించారన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత కుల పత్రాలు అందించకపోవడం వల్ల తమ బిడ్డలు చదువుకోడానికి ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలకు స్కాలర్ షిప్పులు ఫీజు రీయింబర్స్మెంట్ వంటి వాటికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్ల తమకు ఏ విధమైన పథకాలు అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబూరావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, పేర్ల మరిడయ్య, ముగ్గ నాగరాజు, పేర్ల శ్రీను, గోటూరి గంగేష్, ముగ్గ ఏసుదాసు, పేర్ల సాయిరాజు, ఉప్పు భవాని, పేర్ల వెంకటలక్ష్మి, కళ్యాణం పిచ్చమ్మ, గోటూరు లక్ష్మి పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న బేడ బుడగ జంగాలు

నెలపర్తిపాడులో మంత్రి వేణు పర్యటన

ప్రజాశక్తి-రామచంద్రపురం

తమకు పరిశుభ్రమైన రక్షిత మంచినీరు అందించాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాలకృష్ణను నెలపర్తిపాడు గ్రామ ప్రజలు అభ్యర్థించారు. సోమవారం మంత్రి వేణు గ్రామంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది వాలంటీర్లతో కలసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు ఈ సందర్భంగా. తాగునీటి సమస్యను తాగునీటి సమస్యను, అధ్వానంగా ఉన్న రోడ్ల సమస్యను, డ్రైనేజీ లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రికి వివరించారు. గ్రామంలో చాలామంది ఇళ్లు కట్టుకోలేని స్థితిలో ఉన్నారని ప్రభుత్వం ద్వారా వాళ్లకి ఇల్లు కట్టించాలని, కొంతమందికి వద్ధులకు పెన్షన్లు రాలేదని తెలిపారు. బాపనయ్య చెరువు గ్రామంలో ప్రధానమైన రోడ్డు వెడల్పు చేయాలని గ్రామస్తులు మంత్రి కోరారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. విద్యారంగంలో మనబడి-నాడు నేడు, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన తదితర పథకాలు అమలవుతునాయి అని వివరించారు. ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్టును ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని వివరించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే ప్రత్యక్ష నగదు బదిలీ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని తహశీల్దార్, తేజేశ్వరరావు, గ్రామ సర్పంచ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతన్న మంత్రి వేణు

గురుకుల పాఠశాలలో సిసి కెమెరాల ఏర్పాటు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలకు సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు డిసిఒ తెలిపారు. గురుకుల పాఠశాలలకు రక్షణ కల్పించాలని కోరడంతో ఈ సమస్యలకు పాఠశాలల వద్ద మహిళా పోలీసులను ఉంచుతామని, ఈలోగా సిసి కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌పి ఆదేశించారని డిసిఒ పేరెంట్స్‌కు తెలిపారు. గురుకుల పాఠశాల వద్ద గత సంవత్సరం నుంచి అనేక సమస్యలపై పేరెంట్స్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి పరిష్కారం లేకపోవడం వల్ల ఇటువంటి సమస్యలు వస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. పాఠశాల ఆవరణలో చుట్టూ ఉన్న ప్రహరీ గోడ ఎత్తు చేయాలని, డైనింగ్ హాల్, డార్మెటరీ, స్కూల్ ప్రాంగణంలో భవనాలపై ఎలక్ట్రికల్ లైట్లు ఏర్పాటు చేయాలని, పేరెంట్స్ డిసిఒకు విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాల ఆవరణలో సిబ్బందికి క్వార్టర్స్ వెంటనే నిర్మించాలని, పాఠశాల ప్రాంగణంలో నివాసం ఉంటున్న ప్రైవేటు వ్యక్తి నివాసాన్ని వెంటనే తొలగించాలని పేరెంట్స్ డిమాండ్ చేశారు. బాలికల గురుకుల పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థినులు ఉన్న చోట ప్రైవేట్ వ్యక్తులు నివాసాలు తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ సంవత్సర కాలంగా స్పందించకపోవడం విద్యార్థినిల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

ప్రజాశక్తి-మండపేట

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో జాప్యం చేయవద్దని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. సోమవారం పట్టణంలోని 9వ వార్డులో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పట్టణ పరిశుభ్రతలో భాగస్వాములు కావడంతో పాటు ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు చెత్తను అందజేసి వారికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, వైసిపి నాయకులు మొండి మురళి, లావణ్య పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ఉప్పలగుప్తం : ఇటీవల మరణించిన ఉప్పలగుప్తంకు చెందిన మధుర కృష్ణమూర్తి కుటుంబానికి సోమవారం కోనసీమ చేపల వర్తక సంఘం సమకూర్చిన రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానిక సర్పంచ్, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు ఈ సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు సత్తిబాబు, చేపలవర్తక సంఘం అధ్యక్షుడు ధర్మాడి చినఏడుకొండలు, ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటరమణ, సంయుక్త కార్యదర్శి కొప్పాడి శ్రీనివాసరావు, సభ్యులు మల్లాడి పుల్లయ్య, ఆకుల పల్లయ్య, మల్లాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలు

మండపేట : విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో యుడిఐఎస్‌ఇ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంఇఒ నాయుడు రామచంద్రరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకటి నుంచి 17 ఏళ్ల వయసు కలిగిన బడి ఈడు పిల్లలంతా పాఠశాలలో ఉండాలన్నారు. జిఇఆర్ 100 శాతం ఉండాలన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఈ సంవత్సరం తప్పిన విద్యార్థులు తిరిగి పాఠశాలలో చేరే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి-ముమ్మిడివరం, అయినవిల్లి

వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల పట్ల స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లకు అండగా ఎంపిపి కోల గంగా భవాని బాబ్జి, జెడ్‌పిటిసి కుడుపూడి శంకరరావు, పెయ్యల చిట్టిబాబు, వైస్ ఎంపిపి పాము చిట్టిబాబు, మట్టపర్తి సురేష్, వైసిపి టౌన్ అధ్యక్షులు బొంతు సత్య శ్రీనివాస్, కాశి జగపతి, కాశి రామకష్ణ నిలిచారు. అయినవిల్లి మండలంలోని వాలంటీర్లు ముక్తేశ్వరం సెంటర్లో నిరసన తెలిపారు. పవన్ కల్యాణ్ ఫోటోలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ ఇన్‌ఛార్జి పులిదిండి ప్రభాకర్, వైస్ ఎంపిపి భయ్యా చినబాబు, గుత్తుల నాగబాబు, మట్టపర్తి శ్రీనివాస్, మట్టపర్తి రామారావు, నంబూరి శ్రీరామచంద్రమూర్తి, మిండగుదిటి రాంబాబు, గుత్తుల రాజమోహన్, వింటి రాజా, కాకిలేటి శ్రీనివాస్, కోనే చంద్రశేఖర్, జిత్తుక రాంబాబు, బడుగు దుర్గాదేవి, చిట్టూరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

రొయ్యల చెరువుల తవ్వకాలపై ఆందోళన

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలోని చేయ్యేరు పంచాయతీ శివారు, మరకోడులో అనధికారికంగా తవ్వుతున్న చెరువులపై గ్రామస్తులు సోమవారం ఆందోళన చేశారు. విచ్చలవిడిగా తవ్వకాలు సాగుతున్నా అధికారులకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. చెరువుల తవ్వకంతో పంట కాలువలు సైతం కలుషితమై తాగునీరు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలు గ్రామాల రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చెరువుల తవ్వకానికి అధికారులు అనుమతించక పోవటంతో తవ్వకానికి దరఖాస్తు చేసుకుని అనుమతి రాకున్నా తవ్వకాలు సాగిస్తున్నారని మహిళలు ఆరోపించారు. పంటలు పండే వరి భూములు సైతం చెరువులుగా మార్చివేస్తున్నారని, గ్రామాల్లో నివసిస్తున్న ఇండ్ల పక్కనే చెరువులు తవ్వేస్తున్నారు,పంట కాలువ గట్టునే చెరువు గట్లుగా మార్చేస్తున్నారు అక్రమ చెరువుల తవ్వకాలు ఆపాలని మేము స్పందనకి అర్జీ పెట్టుకున్నారు.

కార్టూ'నిజం'

జగనన్న సురక్ష ద్వారా ఉచిత సేవలు

జగనన్న సురక్ష ద్వారా పలు పథకాలు ఉచితంగా అందిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. సోమవారం పలుచోట్ల జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కపిలేశ్వరపురంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, జెడ్‌పిటిసి పుట్టపూడి సూర్యనారాయణ, అంగరలో గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, గంగుమళ్ల రాంబాబు, ఎంపిడిఒ ఎం.రామకష్ణారెడ్డి, తహశీల్దారు కె.సూర్యారావు పాల్గొన్నారు. **ఆలమూరు** తహశీల్దారు ఐపి.శెట్టి, ఎంపిడిఒ కె.జాన్ లింకన్, మడికి, జొన్నాడ సర్పంచులు యు.లక్ష్మి మౌనిక, కట్టా శ్రీనివాసు, యనమదల నాగేశ్వరరావు, నాంద్ర నాగమోహన రెడ్డి పాల్గొన్నారు. **అమలాపురం రూరల్** పేరూరు పంచాయతీ పరిధిలోని మూడు సచివాలయాల్లోఉప సర్పంచ్ కుడిపూడి సత్యనారాయణ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి కుడూపూడి భాగ్యలక్ష్మి, జెడ్‌పిటిసి పందిరి శ్రీహరి, ఎంపిడిఒ కె.వెంకటేశ్వర రావు, తహశీల్దార్ పరమట పల్లవి, ఇఒపిఆర్‌డి జి.మల్లికార్జునరావు పాల్గొన్నారు. **కొత్తపేట** సచివాలయం-4లో తహశీల్దారు జిడి.కిషోర్ బాబు, మార్గాన గంగాధర్, గొల్లపల్లి డేవిడ్ రాజు, ముత్యాల వీరభద్ర రావు, సర్పంచ్ రుషి జయలక్ష్మి భాస్కరరావు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** జెడ్‌పిటిసి బోనం సాయిబాబా, తహశీల్దారు డివిఎస్.అనిల్ కుమార్, ఎంపిడిఒ నాతి బుజ్జి పాల్గొన్నారు. **మండపేట** 20వ వార్డులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి జెసిఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు పాల్గొన్నారు. 10, 11, 25, 26 వార్డుల్లో కౌన్సిలర్లు కొవ్వాడ బేబీ అప్పన్నబాబు, సిరంగు జ్యోతి, ముక్కా మేరీ స్వరూపారాణి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మండపేటలో సర్టిఫికెట్ అందిస్తున్న రాణి, బేబి తదితరులు

ఆక్రమణల తొలగింపులో వివక్ష

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రంగరాజుకోడు మీడియం డ్రెన్ పూడిక తొలగింపులో గట్లపై ఉన్న కొబ్బరి చెట్ల తొలగింపులో వివక్ష చూపుతున్నారంటూ పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రంగరాజుకోడు పూడికతీత తొలగింపు పనులకు రూ.94 లక్షలు మంజూరు చేయడంతో పనులు చేపట్టేందుకు రెండు రోజులుగా మురుగు కాలువ గట్లపై ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. మురుగు కాలువ గట్లపై ఉన్న కొబ్బరి చెట్లను ఒక ప్రాంతంలో ఒక విధంగా మరో ప్రాంతంలో మరో విధంగా తొలగిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయాన్ని డ్రైన్స్ డిఇఇ ఎంవివి కిషోర్‌కు ఫిర్యాదు చేయడంతో సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎఇ,కె.సునీత రైతులతో కలిసి మురుగు కాలువ గట్లను డిఇఇ కిషోర్ పరిశీలించారు. మారిశెట్టి పుండరీకాక్షుడు, లెక్ష్మీనారాయణ, ఆకేటి బాబులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కార్మికుని మృతి కేసులో నిందితునికి రిమాండు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఈ నెల 3న జి.మేడపాడు శివారు కెబికె స్పిరిట్ కంపెనీలో కార్మికుని మృతి కేసులో ఒకరికి రిమాండ్ విధించారని సిఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. కంపెనీలో వెల్డింగ్ వర్క్ చేస్తుండగా కార్మికులు గేదెల సారది, ఆసి జగ్గయ్య మధ్య వివాదం చోటుచేసుకుంది. ఇది ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో సారధి తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ కేసులో నిందితుడు ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన ఆసి జగ్గయ్యను సోమవారం సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ అరెస్టు చేశారు. కాకినాడ కోర్టులో హాజరుపర్చగా ఈ నెల 21వ తేదీ వరకూ రిమాండు విధించినట్లు సిఐ చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10వేల చొప్పున జరిమానా

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున న్యాయ మూర్తి జరిమానా విధించారని సిఐ కె.దుర్గాప్రసాద్ చెప్పారు. ఎస్పి ఆదేశాల మేరకు ఎస్ఐలు గోపాలకృష్ణ, సునీలతో కలసి ఆదివారం రాత్రి సామర్లకోట పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన ఎ.అజయ్‌కుమార్, చిత్రాడకు చెందిన పెదపాటి దుర్గాప్రసాద్, జగ్గంపేటకు చెందిన జి.కాటమరాజులపై కేసు నమోదు చేసి కాకినాడ కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ మేరకు జడ్జి జరిమానా విధించారన్నారు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

అమరవల్లి పంచాయతీ పరిధిలోని తమ్మాయిపేటలో కడుపునొప్పి తాళలేక యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తమ్మయ్యపేటలో నివాసముంటున్న మారడా అనంత(20) ఆదివారం అర్ధరాత్రి సమయంలో తీవ్రమైన కడుపునొప్పికి గురైంది. బాధను భరించలేక ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు.

పాము కాటుకు గురైన మహిళ మృతి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఉప్పాడ పంచాయతీ కొత్తపట్నం గ్రామానికి చెందిన సంగాడి లక్ష్మి(52) రెండు నెలల క్రితం పాము కాటుకి గురైంది. అప్పటి నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందింది. ఈ మేరకు కొత్తపల్లి ఎస్ఐ రామలింగేశ్వరరావు కేసు నమోదు చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -గోకవరం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమించడంతో సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోకవరం బంగాళాపేటకు చెందిన ఏల్లే రాము(55) ప్రతిరోజు రాత్రి పడుకోవడానికి అరవపేటలో ఉన్న చర్చి వద్దకు వెళ్లేవాడు. ఎప్పటిలానే ఈనెల 9వ తేదీ రాత్రి7 గంటల సమయంలో చర్చి వద్దకు బయలుదేరాడు. కైలాస భూమి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి స్కూటీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రాము తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రాము కుమార్తె గంగ అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించింది. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎంవిఆర్.రెడ్డి తెలిపారు.

2,500 కేజీల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలోని రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద పాత చెక్‌పోస్ట సమీపంలో వాహనంలో తరలిస్తున్న 2,500 కేజీల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఈ వివరాలను రీజనల్ విజిలెన్సన ఇన్‌ఛార్జి ఎస్పి కె.కుమార్ సోమవారం వెల్లడించారు. తమకు అందని సమాచారంతో రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారుల ఆధ్వర్యంలో దాడి చేసి ఈ బియ్యాన్ని పట్టుకున్నామని తెలిపారు. 50 ప్లాస్టిక్ బస్తాల్లో ఈ బియ్యాన్ని తరలిస్తున్నారని తెలిపారు. ఏలూరు జిల్లా పెదవేగి నుంచి కాకినాడ జిల్లాలోని జగ్గంపేటకు తరలిస్తున్నారని తెలిపారు. తాతపూడి దుర్గాప్రసాద్‌కు చెందిన వాహనంలో పిఠాపురం మండలం విరవకు చెందిన డ్రైవర్ గున్నబత్తుల రాజబాబు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ బియ్యం పిఠాపురం మండలంలోని విరవకు చెందిన డేగల సతీష్‌కు చెందినవిగా గుర్తించామని తెలిపారు. ఏలూరు జిల్లాలోని పెదవేగి గ్రామానికి చెందిన ఉప్పాల ప్రకాష్ నుంచి వీటిని కొనుగోలు చేశాడని తెలిపారు. వీటి విలువ రూ.9లక్షలు ఉంటుందన్నారు. వాహనం, బియ్యం సీజ్ చేసి 6ఎ కేసు నమోదు చేశామని తెలిపారు. రాజమహేంద్రవరం రీజనల్ పరిధిలో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, కానిస్టేబుల్స్ వలీ, ఈశ్వర్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోపాలపురం

కరిచర్లగూడేనికి చెందిన వీరంకి వెంకన్నబాబు(36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. ఈనెల 9న గ్రామానికి చెందిన చెన్నంశెట్టి సూర్యారావు పొలంలో బోరు వేసుకోవడంతో భోజనాలు ఏర్పాటు చేశాడు. ఆ వెంకన్నబాబు వెళ్లాడు. అధికంగా మద్యం సేవించి ఇంటికి వచ్చి వరండాలో పడిపోయాడు. గమనించిన భార్య పోశమ్మ తన పిల్లల సాయంతో వెంకన్నబాబుని స్థానిక పిఎంపి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వెంకన్నబాబు మృతి చెందాడు. పోశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నోదు చేశామని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు.

సంక్షేమ పాలనే ధ్యేయం : ఎంఎల్ఎ దొరబాబు

ప్రజాశక్తి- యు. కొత్తపల్లి

సంక్షేమ పాలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుందని పిఠాపురం ఎంఎల్ఎ పెండం దొరబాబు అన్నారు. సోమవారం ఉప్పాడలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు దక్కేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఉప్పాడలో మినీ హార్బర్, జియో ట్యూబ్‌లను కాంగ్రెస్ హయాంలో కేంద్ర మంత్రి పల్లంరాజు తీసుకొచ్చారన్నారు. టిడిపి హయాంలో వీటిని తీసుకొచ్చినట్టు బస్సు యాత్రలో మాజీ ఎంఎల్ఎ వర్మ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కనీసం రాజకీయ అవగాహన లేకుండా వర్మ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉప్పాడను దత్తతు తీసుకుని ఏ మేర అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పేదలకు అండగా ఉండే వైసిపిపై అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. అనంతరం ఉప్పాడ సచివాలయం-4లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.సుధ, ఉప్పాడ సర్పంచ్ మేరీ, అధ్యక్షులు ఆనాల సుదర్శన్, మండల స్పెషల్ ఆఫీసర్, తహాశీల్దార్ ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంఎల్ఎ దొరబాబు

కలుషిత నీటిని చూపుతున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

కలుషిత నీటితో రోగాల బారిన ప్రజలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

కలుషిత తాగునీటి కారణంగా ప్రజలు రోగాలబారిన పడుతున్నారని పిఠాపురం మాజీ ఎంఎల్ఎ వర్మ అన్నారు. కొండెవరంలో ఆయన సోమవారం పర్యటించారు. తాగునీటి కలుషితపై మహిళలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ వేసవిలో ఉప్పాడ, సుబ్బంపేట, అమీనాబాద్, కొండెవరం, కొత్తపల్లి, మూలపేట గ్రామాలకు ప్రభుత్వం తాగునీటిని సైతం అందించలేకపోయిందన్నారు. కుళాయిల ద్వారా మురుగునీరు, నలకలు, పురుగులతో కలిపిన నీరు వస్తుందన్నారు. మండలానికి నాగులపల్లి వాటర్ స్కీం నుంచి తాగునీరు సరఫరా అవుతుందన్నారు. అక్కడ శుద్ధి చేయకుండా నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. ట్యాంకుల ద్వారా వస్తున్న నీరు కూడా సకాలంలో రావట్లేదన్నారు. కనీసం తాగునీటిని కూడా అందించని వైసిపి ప్రజాప్రతినిధులు 'గడప గడపకూ' అంటూ సిగ్గు లేకుండా తిరుగుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షిత తాగునీటిని సరఫరా చేయాలని లేకుంటే మహిళలతో కలిసి ఎంపిడిఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మాజీ సభ్యులు బత్తుల రాజేష్, నాయకులు గాది రాజుబాబు, వేమగిరి రాంబాబు, దుళ్ల సత్తిబాబు, కె.సుధాకర్, రావు అక్షయ్, కుక్కల రామకృష్ణ, బత్తిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

ప్రజాశక్తి-కోటనందూరు

గ్రామాల్లో సుపరిపాలన, గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థతోనే సాధ్యపడుతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. సోమవారం బోధవరంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగకుండా సచివాలయాల ద్వారా పాలనను ప్రభుత్వం ప్రజల వద్దకు తీసుకొచ్చిందన్నారు. జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి జగన్ పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపికి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు లగుడు శ్రీనివాస్, సర్పంచ్‌లు వేగి అప్పలనాయుడు, వేగి లక్ష్మి, ఎంపిటిసి సభ్యులు లగుడు వరహాలు, నాయకులు దొడ్డు బాబ్జి ఎ ల్లపు సత్యనారాయణ, చింతకాయల చినబాబు, ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపిపి వీరాస్వామి పుట్టినరోజు

ప్రజాశక్తి-చాగల్లు

ఎంపిపి మట్టా వీరాస్వామి పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఎంపిడిఓ బి.రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో మండల సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. వారికి జన్మదిన శుభాకాంక్షలు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు ఎంపిపి మట్టా వీరాస్వామికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

చిరు వ్యాపారులకు గొడుగుల అందజేత

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు సోమవారం గొడుగులు అందించారు. రంగా సుబ్బారావు, సత్యవతి జ్ఞాపకార్థం వారి కుమారుడు వ్యాపారవేత్త రంగా వెంకటేశ్వరరావు రూ.20వేలతో 25 గొడుగులను సోమవారం లయన్స్ ఆడిటోరియంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ ద్వారా చిరు వ్యాపారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్‌వివి.సత్య నారాయణ, కోశాధికారి పూసరపు వెంకటేశ్వరరావు, సభ్యులు జేష్ట వెంకటేశ్వరరావు, పూసరపు వీర రాఘవయ్య, ఎన్‌విఎస్ఎన్.మూర్తి, నీలం రామారావు పాల్గొన్నారు.

లయన్స్ విజన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

నిరాడంబరంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ సేవలు అభినందనీయమని లయన్స్ జోన్ చైర్మన్ శ్రీరామ్ గణేష్‌ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో దీర్ఘకాలిక రోగులకు లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో అజ్జరపు రాజేశ్వరి సౌజన్యంతో నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జోన్ చైర్మన్ శ్రీరామ్‌గణేష్‌ప్రసాద్ హాజరై మాట్లాడారు. సమాజ అవసరాలను గుర్తించి వాటిని సమకూర్చడమే లయన్స్ క్లబ్‌ల లక్ష్యం అని అన్నారు. క్లబ్ అధ్యక్షులు ఎం.ప్రసూన మాట్లాడుతూ సాటి మనిషికి సాయం చేయడమే లక్ష్యంగా తమ క్లబ్ సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రమాసుందరి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

కాల్షియం లోపంతో కీళ్ల సమస్యలు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

కాల్షియం లోపం వల్లే కీళ్ల నొప్పులు వచ్చే అవకాశం ఉంటుందనిడాక్టర్ సువర్ణ రాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. 50 ఏళ్లు పైబడిన వారికి మోకాళ్లు, ఇతర కీళ్లలో నొప్పులు మొదలవుతాయన్నారు. ఉదయం లేవగానే నొప్పులు అత్యధికంగా ఉంటాయన్నారు. కీళ్లు ఎర్రగా, వేడిగా మారి విపరీతమైన నొప్పితో బాధిస్తాయని తెలిపారు. అలసట, ఆకలి లేకపోవడం, జ్వరం, కీళ్ల కండరాల నొప్పులు, కీళ్లను సరిగ్గా కదపలేకపోవడం వంటివి ఈ వ్యాధి లక్షణాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకే పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న పేదలకే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఆర్‌డిఓ జె.సీతారామారావుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ 270 సర్వే నెంబర్‌లో 10.9 ఎకరాల భూమిని 20 కుటుంబాలు రెండు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నాయన్నారు. కొంతమంది వీటిని కాజేయాలని చూస్తున్నారన్నారు. కొంత మంది రెవెన్యూ అధికారులు వారికి సహకరిస్తున్నారన్నారు. ఈ భూములకు సంబంధించి వెంటనే పట్టాలివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నాకుల వీరాంజనేయులు, సురేష్, లక్ష్మి, నారాయణమూర్తి, గోనుపాటి వెంకటరమణ పాల్గొన్నారు.

వెంకటకృష్ణారావుకు నివాళులర్పిస్తున్న అనంతలక్ష్మి దంపతులు

మహేంద్రబాబు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -కరప

పితృ వియోగంతో బాధపడుతున్న జెడ్ బావారం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ డైరెక్టర్ కోటగిరి మహేంద్రబాబు కుటుంబాన్ని మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు సోమవారం పరామర్శించారు. ఇటీవల మహేంద్రబాబు తండ్రి వెంకటకృష్ణారావు గుండెపోటుతో మృతి చెందారు. కాకినాడలో నివాసముంటున్న వారి కుటుంబ సభ్యులను అనంతలక్ష్మి దంపతులు పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వెంకటకృష్ణారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటకృష్ణారావు నేత్రాలను దానం చేయడానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులను అభినందించారు. వారి వెంట టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రకాష్‌గౌడ్, జడ్‌పిటిసి మాజీ సభ్యుడు సింహాద్రి, మాజీ ఎంపిపి జి.శ్రీనివాసరావు, బి.భవాని, పి.గాయత్రి తదితరులున్నారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి - జగ్గంపేట

వాహనదారులు తప్పకుండా లైసెన్స్‌ను కలిగి ఉండాలని జగ్గంపేట సిఐ సూర్య అప్పారావు అన్నారు. సోమవారం జగ్గంపేట జాతీయ రహదారిపై జెవిఆర్ కాంప్లెక్స్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. రహదారి నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. సిఐతో పాటు పోలీస్ సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

వైద్యానికి 'మానవత' సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

విద్యా వైద్య ఆర్థిక అవసరాలు ఉన్నవారు మానవత సేవా సంస్థను ఆశ్రయిస్తే వారి అవసరాలను తీర్చడానికి అన్నివేళలా సేవా సంస్థ అందుబాటులో ఉంటుందని మండల మానవత శాఖ అధ్యక్షులు సాయన సుబ్బారావు అన్నారు. కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన సాధనాల మురళికి వైద్య ఖర్చుల నిమిత్తం మానవత శాఖ సోమవారం రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ కార్యక్రమంలో మానవతా కార్యదర్శి తిగిరిపల్లి దోసయ్య, ఇసి మెంబర్ సనపల రాజశేఖర్, పూర్వపు అధ్యక్షులు తుంపూడి నాగభూషణ గుప్త, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పిల్లల్లో సేవా భావాన్ని పెంచాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రతి వ్యక్తీ పిల్లలను చిన్నతనం నుంచి సేవాభావంతో పెంచాలని నందన ఫౌండేషన్ ప్రతినిధి దేవరపల్లి రమేష్ అన్నారు. పైడిమెట్ట గ్రామానికి చెందిన ఈ ఫౌండేషన్ అదే గ్రామానికి చెందిన జొన్నకూటి దర్శిత్ జయంతి సందర్భంగా సోమవారం వందమందికి భోజనాలను అందించారు. తమ ఫౌండేషన్ ద్వారా ప్రతినెలా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కొంతమంది దాతలు కూడా వీటికి సహకరిస్తున్నారని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి విజయ్, జొన్నకూటి సందీప్, గంట జస్వంత్, ఎస్‌కె.వలీ, వినోద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని రంపయర్రంపాలెంలో టిడిపితోనే మీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో మినీ మేనిఫెస్టో కరపత్రాలు ఉంగరాల రాము ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. సంపద సృష్టించడం ఆ సంపద ద్వారానే సంక్షేమ పథకాలు అమలు చేయడం ఒక చంద్రబాబు నాయుడుకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం వెంకటేశ్వరరావు, సర్పంచ్ బాదంపూడి హర్షిత, గుత్తుర్తి నాగేశ్వరరావు, గోలి రాజు, గంట చిలకయ్య, టిడిపి సీనియర్ నాయకులు బాదంపూడి ప్రకాష్, పప్పు రాఘవులు, నరాల మురళి, ఎన్.గణపతి పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనం పంపిణీ

ప్రజాశక్తి- రౌతులపూడి

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజన పథకంలో ప్రతి నెలా 9న ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు భోజనం పంపిణీ జరుగుతుంది దీనిలో భాగంగా శుక్రవారం రౌతులపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీ దుర్గాదేవి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనం సమకూర్చారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రమణమ్మ, వైద్యులు జానకిదేవి, సౌమ్య, సునీత, అభివృద్ధి కమిటీ సభ్యులు సత్యనారాయణ, ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రతినిధులు

జాబ్ మేళాలో 53 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 53 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణసుధాకర్ తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పి రఘునాయగం హాజరయ్యారు. ఆర్ఎఓ మునిస్వామి మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కృష్ణసుధాకర్ మాట్లాడుతూ జాబ్ మేళాకు 60 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఐటిఐలో 42 మంది, డిప్లమోలో ముగ్గురు, బిటెక్ ఎనిమిది మంది మొత్తంగా 53 మంది ప్రీమియర్ సోలార్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్, ఆవిష్కరన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో ఉద్యోగాలు పొందారన్నారు. ఈ జాబ్ మేళాలో ఆయా సంస్థల ప్రతినిధులు జి.కమల్, జానీభాషా ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాసంశెట్టి ఆనంద్, లంక ప్రసాదరావు, యాళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

విద్యార్థులను సత్కరిస్తున్న ఆర్ఎఓ

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయంలో 2022 - 23 విద్యాసంవత్సరం సిబిఎస్ఇ బోర్డు పరీక్షల్లో అత్యున్నత ప్రతిభను కనబర్చిన విద్యార్థులను సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ టివిఎస్.ప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎఓ మునిస్వామి హాజరయ్యారు. విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్, ఎస్ఆర్‌కె ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ వరుగు భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కో-ఆపరేటివ్ సిబ్బంది ఆందోళన

ప్రజాశక్తి - యానాం

యానాం కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ లో పనిచేస్తున్న సుమారు 85 మంది సిబ్బందికి 30 నెలల నుంచి వేతనాలు అందించకపోవడంతో మంగళవారం నుంచి ఆందోళన బాట పట్టనున్నారు. తమకు వెంటనే వేతన బకాయిలు చెల్లించాలన్నారు. వేతనాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులకు తెలియజేసినా పట్టించుకోవట్లేదన్నారు. దీంతో ఆందోళనకు దిగాల్సి వస్తుందన్నారు. సమస్య పరిష్కారమయ్యేవరకూ పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు.

పూజలు నిర్వహిస్తున్న మల్లాడి కృష్ణారావు

గ్రామ దేవతలను దర్శించుకున్న మల్లాడి

ప్రజాశక్తి - యానాం

ఆషాడ మాసం సందర్భంగా స్థానిక అగ్రహారం, కొత్తపేట, కనకాలపేట, ఫిషర్ మెన్ పేటలో గ్రామదేవతలు మహాలక్ష్మి, ధనమ్మ తల్లి, పోలేరమ్మలను మాజీ మంత్రి, ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సోమవారం దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.గ్రామ దేవతల మహోత్సవాలను స్థానికుల ఘనంగా నిర్వహిస్తున్నారు.

రాయల్ రిక్రియేషన్ క్లబ్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలో అడవిపొలంలో ఉన్న రాయల్ రిక్రియేషన్ క్లబ్‌లో పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, ఎస్‌పి.రఘునాయగం, మున్సిపాలిటీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రాయల్ రిక్రియేషన్ క్లబ్‌లో మద్రాస్ హై కోర్టు ఆర్డర్స్‌కి వ్యతిరేకంగా కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదు రావడంతో ఈ తనిఖీలు చేపట్టారు.

సవరణ

ది.09-07-2023వ తేదీన ప్రజాశక్తి తూర్పు గోదావరి జిల్లా 7వ పేజీలో ప్రచురించబడిన కె.శ్రీనివాసరావు, బి.శ్రీనివాస్ గార్ల 4వ జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టు కాకినాడ 2 నోటీసులలో ఐ.ఎ.నెం.1107/2022, ఓ.ఎస్.నెం.651/2022 అని పొరపాటుగా ప్రచురించబడినది. దానికి బదులుగా ఐ.ఎ.నెం.651/2022, ఓ.ఎస్.నెం.1107/2022 అని 2 కోర్టు నోటీసులలో సరిచేసి చదువుకొనగలరు.

ఇట్లు
కె.శ్రీనివాసరావు
బి.శ్రీనివాస్, అడ్వకేట్స్, కాకినాడ.

రాష్ట్రంలో అరాచక పాలన

మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, సంక్షేమం ముసుగులో ప్రభుత్వం ఆర్భాటం చేయడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం పి.వెంకటాపురంలో 'వస్తున్నా మీ గ్రామానికి- మీ అనంతలక్ష్మి' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇంటింటా వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. వారు మాట్లాడుతూ నాలుగేళ్ల జగన్ పాలనలో ప్రజలంతా నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందన్నారు. అప్పులు తప్ప అభివృద్ధి లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి కో-ఆప్షన్ మాజీ సభ్యులు మట్టా ప్రకాష్‌గౌడ్, నాయకులు పిల్లి వెంకటేశ్వరరావు, బి.శ్రీను, కె.శ్రీను, ఎన్.ప్రసాద్, పి.వీరబాబు, కె.శేఖర్, గుత్తుల లక్ష్మి, భద్రం, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి : సత్యప్రభ

ప్రజాశక్తి -రౌతులపూడి

రాష్ట్ర అభివృద్ధి టిడిపి తోనే సాధ్యమని ఆ పార్టీ ప్రతిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సత్యప్రభ అన్నారు. సోమవారం మండలంలోని ఎ.మల్లవరం, ఎన్‌వి.నగరం, ఎస్.అగ్రహారం, డిజె.పురం తదితర గ్రామాల నాయకులు, కార్యకర్తలను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. టిడిపి అధికారంలోకొస్తే అన్ని వర్గాల ప్రజలకు పూర్తి స్థాయిలో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షులు పల్లి సూరిబాబు, ఎంపిటిసి సభ్యులు సోమరౌతు రవి, పైలా అశోక్‌వర్మ, కె.వరహాలు, పి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంజరం వంతెన వద్ద టిడిపి సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు మండలానికి ప్రధాన సాగునీరు ఇస్తున్న పంట కాలువపై శిథిల స్థితికి చేరుకున్న ఇంజరం కోలంక వంతెన వద్ద టిడిపి నాయకులు సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. 'భవిషత్తుకు గ్యారెంటీ చైతన్య బస్సు యాత్ర'లో భాగంగా మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, టిడిపి అమలాపురం లోక్ సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంటి హరీష్‌మాథూర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు సోమవారం ఇంజరం వంతెన వద్ద సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చిక్కాల మాట్లాడారు. ఇంజరం వంతెన శిథిల స్థితికి చేరుకుని ఏళ్లు గడుస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వంతెన దిగువన తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టు తొలగించకపోవడం వల్ల మండలంలోని శివారు భూములకు నేటికీ సాగునీరు అందలేదన్నారు. అనంతరం యాత్రను ప్రారంభించారు. ఇంజరంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. తాళ్లరేవు, ఐ.పోలవరం మండలాలకు చెందిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా ముమ్మిడివరం తరలి వెళ్లారు.

సెల్ఫీ తీసుకుంటున్న టిడిపి నాయకులు

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A.No. 1558/2018
A.S.S.R.No. 4553/2018

Between:
Nallamilli Bhaskara Reddy ...*Petitioner*
AND
Meesala Mallikharjuna Rao and Others ...*Respondents*
TO: ***R-1:*** Meesala Mallikharjuna Rao, S/o. Narasimharao, aged 36 Yrs, D.No. 16-2-53/5, Atkurivari Street, Jaggammagari Peta, Samalkota.
R-2: Meesala Vijaya Bhanu, S/o. Narasimharao, aged 36 Yrs, D.No. 59-20-8/1, Annammgati Centre, Kakinada.
R-3: Meesala Mahesh, S/o. Veera Swamy, aged 52 Yrs, Business, D.No. 16-2-58/4, Atkurivari Street, Samalkota.

సదరు పై నెంబరు గ్రంథమున ఇందలి రెస్పాండెంట్లు నెం.1 మరియు 2 వారలకు ఎన్నిసార్లు నోటీసులు పంపించి యున్నప్పటికిన్నీ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **ది.18-07-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరై ఆక్షేపణలు తెలియపరచుకొనగలరు.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎన్.ఎస్.ఆర్.ఎన్.చౌదరి
కాకినాడ, అడ్వకేట్, కాకినాడ.
23-6-23. సెల్: 98482 22565

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.యస్.నెం.7/2021

బిట్వీన్:
ఉల్లింగి సీత ...వాది
మరియు
పి.ఎల్.హెచ్.విక్టోరియా రాణి ...ప్రతివాది
టు: ప్రతివాది:
పి.ఎల్.హెచ్.విక్టోరియా రాణి, భర్త: కొంగు నారాయణ పౌల్, తీగగుంట, తుని మండలం.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినను మీరు వాటిని తీసుకోనందున శ్రీ కోర్టు వారు పబ్లికేషను ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. సదరు దావా వాయిదా **ది.17-07-2023వ తేదీన అయి ఉన్నది. కావున సదరు తేదీని పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను.** లేనిచో దావా పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
శ్రీ ఎన్.వి.సూర్యనారాయణ
శ్రీ ఎన్.వి.కె.శర్మ
అడ్వకేట్స్, అమలాపురం.
సెల్: 98491 42007, 98492 76623